ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 01 జూలై , 2025 | పేజీలు : 06

## పానగల్ ఉదయ సముద్రంలో దెయ్యం చేపలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణ పరిధిలోని పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్లో దెయ్యం చేపలు దర్శనమిచ్చాయి. మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లగా వివిధ రకాల చేపలతో పాటు దెయ్యం చేపలు వలకు చిక్కాయి. ఈ చేపలు నల్లగా ఉండడంతో మత్స్యకారులు వలలలో నుండి తీసి బయటపడేశారు. ఇవి తినడానికి పనికిరావని ఇలాంటి చాపలను ఎక్కడ చూడలేదని మత్స్యకారులు తెలిపారు. ఈ చేపలను మొదటి సారిగా చూసామని రిజర్వాయర్లోకి ఎలా వచ్చాయో తెలియడం లేదన్నారు. ఈ చాపలను చూడడానికి ప్రజలు క్యూ కట్టారు.

# వరికి ప్రత్యామ్నాయం అయిల్‌పామ్‌సాగు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వరికి ప్రత్యామ్నాయంగా, అధిక దిగుబడి ,ఆదాయాన్నిచ్చే సులభతరమైన, వాణిజ్య పంట ఆయిల్ పామ్‌ను సాగు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన రైతు సంకినపల్లి వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 12.5 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టగా, జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మొదటి మొక్కను నాటారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఆయిల్ పామ్ మొక్కను ఒకసారి నాటితే 4 వ సంవత్సరం నుండి నిర్విరామంగా 30 సంవత్సరాల వరకు సరాసరిన ఎకరానికి 10 నుండి 12 టన్నుల దిగుబడిని తీసుకోవచ్చని, అంతేకాక ఎకరానికి లక్ష ఇరవై వేల నుండి లక్ష యాభై వేల వరకు నికర ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ పంటకు జంతువుల నుండి దొంగల నుండి ఎటువంటి బెడద ఉండదని, ఆయిల్ పామ్ వేసిన రైతు ప్రతి నెల ఆదాయాన్ని తీసుకొనే సౌకర్యం ఉంటుందని చెప్పారు.అంతేకాక మొదటి నాలుగు సంవత్సరాలకు మొక్కల యాజమాన్యానికి ఎకరానికి 4200 రూపాయల చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంత రెడ్డి , పతంజలి ఫుడ్స్ జిల్లా జనరల్ మేనేజర్ యాదగిరి , ఉద్యాన అధికారులు, శ్వేత, రిషిత, నసీమా మరియు ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, మనోహర్, భారత్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు , గ్రామ రైతు లు పాల్గొన్నారు.



## గత మూడు సంవత్సరాలుగా బిల్లులు పడతలేవ్...

### కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు తల్లిదండ్రుల నిరసన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా బిల్లులు పడతలేవు అని చెప్పేసి ప్రైవేట్ స్కూల్ యజమాన్యం పిల్లలను స్కూళ్లకు రానివ్వడం లేదని అదేవిధంగా స్కూళ్లలో, బుక్కులు, డ్రెస్సులు ఇవ్వడం లేదని ఆరోపించారు. స్కూళ్లలో విద్యార్థులకు కల్పించవలసి న ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని హాస్టల్లోకి రానివ్వడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ పాఠశాలలకు బిల్లులు చెల్లించి తమ పిల్లలు చదువుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు మామిడి జగన్, కార్తీక్, యాదగిరి, శంకర్, రవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణం

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు హౌసింగ్ పిడి ధర్మారెడ్డి ఎంతగానో కృషి చేశారని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిడి ధర్మారెడ్డి పదవి విరమణలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సూచనలు అనుసరిస్తూ ప్రజల నుండి స్వీకరించిన ఇందిరమ్మ ఇండ్ల ఆర్జీలను హౌసింగ్ ఏఈల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఏఈలకు ముందుగా శిక్షణ ఇచ్చి తదుపరి క్షేత్రస్థాయి పరిశీలించేందుకు పిడి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదలుపెట్టినప్పటి నుండి ప్రతి రోజు నా మొదటి ఫోన్ కాల్ అలాగే చివరి ఫోన్ కాల్ హౌసింగ్ పిడికే చేసి ప్రతిరోజు వివరాలు తెలుసుకునేదని తెలిపారు. 1983 నుండి 2025 వరకు 42 సంవత్సరాల పాటు హౌసింగ్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఉన్నతస్థాయికి చేరుకున్నారని అన్నారు. హౌసింగ్ పిడి ధర్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిటిడివో శంకర్, హౌసింగ్ డిఈ జబ్బార్, హౌసింగ్ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.



## పర్యాటక కేంద్రంగా అక్కన్న మాదన్న ఆలయం



### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని మహాదేవపూర్ గ్రామంలో గల అక్కన్న మాదన్న పురాతన ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మహాదేవపూర్ గ్రామంలో గల భక్త రామదాసు నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా ఆగిపోయిన అక్కన్న మాదన్న ఆలయాన్ని రాష్ట్ర టూరిజం శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, రాజ్యసభ మండల అధికారి కృష్ణారెడ్డితో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ఈ ఆలయ అభివృద్ధి కోసం ప్రసాద వికరణ స్కీం కింద ఆలయానికి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, స్వామివారికి ఉన్న భూమిలో చుట్టూ ప్రహరీ గోడ గార్డెన్ ఏర్పాటు చేసి భక్తులను ఆకట్టుకునే విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ చైర్మన్ శివారెడ్డి, ఈవో రుద్ర వెంకటేష్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో వైస్ శ్రీనివాసరెడ్డి, కన్సల్టెంట్ శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగలి రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, మాజీ జెడ్పిటిసి సంధిగారి బసవయ్య, మాజీ జిల్లా నాయకులు ఫోటోల శ్యామ్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు గోలి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సంవత్సర కాలంలోనే డిసిసిబి పురోగతి

### చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** డిసిసిబి గతంలో ఎన్నడు లేని విధంగా ఒక సంవత్సరంలోనే రూ.598. 16 కోట్లకు పెంచుకోవడంతో పాటు బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.2940.29 కోట్లు చేరుకోవడం జరిగిందని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా సోమవారం ఆ బ్యాంక్ జిల్లా కార్యాలయంలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒక సంవత్సర కాలంలో బ్యాంక్ వ్యాపారము గతంలో ఎన్నడు లేని విధంగా ఒక సంవత్సరంలో రూ.598. 16 కోట్లకు పెంచుకోవడంతో పాటు బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.2940.29 కోట్లు చేరుకోవడం జరిగిందన్నారు. ఈ పాలకవర్గం ఏర్పాటు జరిగిన వెంటనే క్రాప్ లోన్ గరిష్ట పరిమితి లక్ష రూపాయల నుండి లక్ష యాభై వేలు పెంచుకోవడం జరిగిందని పేర్కొన్నారు.లోన్ల విషయంలో పాత పుస్తకాలు అవసరం లేకుండా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ పాలకవర్గం క్రాప్ లోన్ బడ్జెట్ 100 కోట్లకు పైగా తీసుకురావడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నూతన పథకాలు ఎన్ఎల్ఎం, గ్రామీణ ప్రాంతాలలో గృహ రుణాలు, సొసైటీలకు గోడౌన్ నిర్మాణాల కోసం వరల్డ్ లార్జ్ గ్రైన్ స్టోరేజ్ ప్రాజెక్టు ఇతర పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. అభివృద్ధికి సహకరించిన పాలకవర్గాన్ని బ్యాంకు సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాశం సంపత్ రెడ్డి, కొండా సైదయ్య,విరిగినేని అంజయ్య, గుడిపాటి సైదయ్య,ధనావత్ జయరాం, బంటు శ్రీనివాస్, కోడి సుష్మ , కొమ్ము కరుణ, కె. వీరస్వామి, బ్యాంకు సీఈఓ శంకర్ రావు, బ్యాంకు జిఎం.నర్మదా, బ్యాంకు డీజీఎం లు, బ్యాంక్ ఎజిఎం లు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. చైర్మన్‌ను డైరెక్టర్లు సిబ్బంది ఘనంగా సన్మానించారు.





## ఫిర్యాదులు పరిశీలన

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంతో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు అదేశించారు.

## జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది (జిపి)గా ఫరిదొద్దీన్ నియామకం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది (జిపి)గా ఫరిదొద్దీన్ నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా జడ్జి చేతుల మీదుగా ప్రభుత్వ నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీమంత్రి వర్యులు, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎఐసిసి సభ్యులు సర్వోత్తమ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుభాస్కర్, డిసిసి అధ్యక్షులు, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా లీగల్‌సెల్ చైర్మన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు నూకల సుదర్శన్‌రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

## హెల్మెట్ల వినియోగం శ్రేయస్కరం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం వల్ల శ్రేయస్కరమని చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ విజయ్ మోహన్ అన్నారు. సోమవారం ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారి 65 పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి సుమారు 25 మందికి వారి పై మొదటి తప్పుగా మన్నించి కేసు నమోదు చేయకుండా హెల్మెట్ వినియోగం అలాగే హెల్మెట్ వాడకం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి వారి సొమ్ముతో హెల్మెట్లు కొని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ఐ ఆంజనేయులు, ఏఎ ఐ కె.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, సత్యనారాయణలు సిబ్బంది పాల్గొన్నారు.



## ఆలేరు-వలిగొండ బస్సును పునఃప్రారంభం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని చాడ పరిసర గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు, గతంలో ప్రజాపక్షం దిన పత్రికలో వెలువడిన కథనాలకు స్పందించిన ఆర్‌టిసి అధికారులు ఎట్టకేలకు సోమవారం పునరుద్ధరించి బస్సును ప్రారంభించారు. ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న మోటకొండూరు మండల కేంద్రంనకు వెళ్ళాలన్నా, ఆలేరు నియోజకవర్గ కేంద్రానికి వెళ్ళాలన్నా ఇక్కడి ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ఈ బస్సు రావడానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్యగౌడ్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, మండల వివిధ పార్టీ నాయకులకు యాదగిరిగుట్ట డిఎం, ఆర్ఎంలకు చాడ రెవెన్యూ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ గస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈరగాని శ్రీనివాస్ గౌడ్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్ మాదిగ, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్చార్జ్ గంధమల్ల లింగస్వామి, మండల కాంగ్రెస్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, స్థానిక మాజీ సర్పంచులు ఆడెపు విజయ స్వామి, మల్ల ఎట్టమ్మ, ముత్తిరెడ్డిగూడెం పాల్గొన్నారు.

## రావుల వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి




**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిషత్ కార్యాలయానికి రావుల వెంకటేశ్వర్లు చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పదవి విరమణ పొందిన రావుల వెంకటేశ్వర్లు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నందు ఆఫీస్ సబార్డినేటర్‌గా విశిష్ట సేవలందించారని, 39 సంవత్సరాలు ఒకే దగ్గర అమూల్యమైన పనులు నిర్వర్తిస్తూ జిల్లా ఉత్తమ అవార్డును పొందినట్లు తెలిపారు. పదవి విరమణ పొందిన వెంకటేశ్వర్లు ఆయురారోగ్యాలు జీవితాంతం ఉండాలని, అతని సేవలు సమాజసేవలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి శ్రీనివాసరావు, కొప్పుల జైపాల్‌రెడ్డి, సుంకర అజయ్‌కుమార్, కాసర్ల కోటేశ్వరరావు, యలక బిందు నరేందర్‌రెడ్డి, ఉప్పుల రజితా జానకిరెడ్డి, కాసర్ల శ్రీను, తొగరు రమేష్, చింతకాయల ఉపేందర్, చందా చంద్రయ్య పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి




**ప్రజాపక్షం/వలిగొండ :** ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శాంతియుత దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ దీక్ష శిబిరానికి మాజీ వైస్ ఎంపీపీ కుంభం వెంకట పాపిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వంగాల అశోక్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తిని సహదేవ్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు బందారపు లింగస్వామి, సిపిఐ కార్యదర్శి చలిగంజి వీరస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, బొడిగె సుదర్శన్, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, గర్దాసు నరసింహ, బీఆర్ఎస్ నాయకులు ఐటి పాముల ప్రభాకర్, పబ్బు స్వామి గౌడ్,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దుబ్బ దానయ్య,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరుమండ్ల యాదగిరి, మండల అధ్యక్షుడు కూచిమల్ల నాగేష్, రాపోలు పవన్ కుమార్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, సంఘాల నాయకులు హాజరై సంఘీభావం తెలియజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి, సీలోజు శ్రీరాములు, కదిరేని స్వామి, ఐటిపాముల పుష్ప, ఎక్కలదేవి శ్రీనివాస్, కన్నెకంటి శ్రీనివాసచారి, దండ మల్లికార్జున్, కొండూరు సత్తయ్య, ఎదురుగట్ల యాదగిరి,పెద్ద యాదగిరి, సందయ్య, లక్ష్మ య్య, కోమటి సోమయ్య, ఎండి.యూసుబ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ ఛానెల్‌పై దాడి అమానుషం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హైద్రాబాద్‌లోని మహా న్యూస్ ఛానెల్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన దాడి అమానుషమని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై అతస్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన చంద్రబాబునాయుడిపై ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణాను అప్పుల తెలంగాణాగా మార్చి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలన్నా. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య సెల్ నాయకులు ఏచూరి అనంతరాములు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మచ్చ సైదులు, చవల వెంకటేశ్వర్లు, పొట్ల శంకర్‌రావు, దాసోజు కాంతాచారి తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేడ్ మార్కెట్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పట్టణంలోని నిర్మాణం చేసిన ఇంటి గ్రేడ్ వెజ్‌నాన్‌వెజ్ మార్కెటను, బాలెలం వర్మికంపోస్టు యార్డ్ నందు నిర్వహిస్తున్న వెస్ట్ సేగ్రిగేషన్ విధానాన్ని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తడి,పోడి చెత్తను వేరు చేసి మీ ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. అదే విధంగా మహాప్రస్థానాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కాటి కాపరులు మృతి చెందిన కుటుంబాల వారి నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నరని, దీనిపై త్వరలో వారిని పిలిపించి మాట్లాడుతానని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఆర్ఐలు గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఇండ్ల మనోజ్‌కుమార్, శివప్రసాద్, జవాన్లు కొండేటి వెంకన్న, రఫీ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు అవకతవకలపై ధర్నా




**ప్రజాపక్షం/భువనగిరి :** భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లా అర్హులైన వారికి పంపిణీలో అవకతవకలు జరగడంపై తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించి ఇన్చార్జికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వెంటనే అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తామని చెప్పి కూడా జాప్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబెర్ కోళ్ల బిక్షపతి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జనగాం కవిత నరసింహచారి, పట్నం కపిల్, మేడి కోటేష్, నల్లమాస వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి కృష్ణ చారి, ఉడుత భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు కొల్లోజు సతీష్, యాట వెంకటేష్, పట్టణ కార్యదర్శులు ఇండ్ల సత్యవతి, కొలిచెలిమా మల్లికార్జున్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇండ్లు కట్టించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందచేసి వారు మాట్లాడారు. మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బేడ బుడిగజంగాలు గుడిసెలు వేసుకోని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దుర్భర జీవితం వెల్లదీస్తున్నా ప్రభుత్వం, అదికారులు వారి సమస్యను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. అర్హత లేని వారికి సంక్షేమ పథకాలు అందుతున్నా పట్టించుకోని అధికారులు, నిలువ నీడ లేని పేదల బాధలు పట్టవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల స్పందించి జంకుతండా పేదలందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలపక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడ్తామని హెచ్చరించారు. అనంతరం జంకుతండా పేదలతో లకిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జానికిరాంరెడ్డి, గ్రామస్థులు జానయ్య, లక్ష్మ మ్మ, వరలక్ష్మీ , సైదమ్మ, అలివేలు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





## ఉద్యమకారుల డిమాండ్లు అమలు చేయాలి

**ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్**

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టియుఎఫ్ చేస్తున్న శాంతియుత దీక్షలకు మద్దతుగా ఏవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యమకారులను ఏమాత్రం కూడా పట్టించుకోలేదని అన్నారు ఉద్యమకారులు రాష్ట్ర ఏర్పాటుకు సకల జనులను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారు అని అన్నారు రాష్ట్రాన్ని సాధించారు అందులో భాగంగా మరి ముఖ్యంగా రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది తమ భుజాల పైన వేసుకుని రాష్ట్రాన్ని సాధించే వరకు ఉద్యమకారులు పోరాటం చేశారని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బొడిగె సుదర్శన్ పాల్గొన్నారు.

## పాలసంఘం చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని వాసాలమర్రి గ్రామంలో నూతనంగా ఎన్నికైన పాల ఉత్పత్తి దారుల పరస్పర సహకారసంఘం చైర్మన్‌గా పలుగుల భూపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను తాజా మాజీ ఎంపీటీసి పలుగుల నవీన్ కుమార్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పలుగుల రజిని, పలుగుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గ్యార నరసింహులు, గోనె శ్రీనివాస్, పలుగుల భిక్షపతి, సత్యం, దేవెందర్, కొత్తింటి క్రిష్ణ, రాజు, శ్రీకాంత్, ప్రతాప్, కొక్కొండ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ వివరాలను గోప్యంగా ఉంచాలని వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : చేనేత కార్మికుల రుణమాఫీ వివరాలను అధికారులు గోప్యంగా ఉంచాలని కోరుతూ సోమవారం పోచంపల్లి చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు ఎస్బిఐ టీజీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. రుణమాఫీ సంబంధించిన సమాచారాన్ని సంబంధిత అధికారులకే తప్ప ఇట్టి సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఎవరికి కూడా ఇవ్వద్దని రాతపూర్వకంగా లేక ఇవ్వడం జరిగిందనీ తెలిపారు. ముఖ్య చేనేత నాయకులు, యాదాద్రి జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి ని కలిసి రుణమాఫీకి సంబంధించిన జాబితాను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకుండా నిజాయితీగా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు చింతకింది రమేష్, కర్నాటి పురుషోత్తం, ఏలే బిక్షపతి ఏలే శ్రీనివాస్, గంజి కృష్ణ మస్నం రాములు, తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.



# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణం

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్ భాస్కర రావు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సర్వసాధారణమని,పదవి విరమణ బాధ్యతల నుండి తప్పించి బందాలను బలపరుస్తుందని శేష జీవితం ఆనందంగా గడపాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వి.హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌గా పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా సోమవారం చౌటుప్పల్ ఎంఎస్ రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా పదవి విరమణ సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావులు హాజరై పదవి విరమణ పొందుతున్న కోమటిరెడ్డి నరసింహారెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించి వారికి జ్ఞాపికను అందజేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మెజారిటీ కాలం బాధ్యతల నిర్వహణలో ఒత్తిడితో గడుస్తుందని సుదీర్ఘ కాలం నిబద్ధతతో పనిచేసి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆయన సూచించారు. అడిషనల్



కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ పట్టణ ప్రగతి కార్యక్రమంలో, మున్సిపల్ విభాగంలో మున్సిపల్ కమిషనర్ గా కోమటిరెడ్డి నరసింహారెడ్డి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ మున్సిపాలిటీలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు కోమటిరెడ్డి నరసింహారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ఆర్డిఓ వి.శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో వీరా బాయి, ఎంపీడీవో సందీప్ కుమార్, చౌటుప్పల్ నూతన మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్ ఎదురుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపుమేరకు మండల ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష కార్యక్రమం ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె.చాంద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం, రూ.25వేల పెన్షన్ అందించాలని కోరారు. అదేవిధంగా ఎస్‌కె.చాంద్ మాట్లాడుతూ రామన్నపేట మండలమంటే తెలంగాణ ఉద్యమకారులకు పుట్టినిల్లు అని నాడు తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన వారు నేడు కొంతమంది అమరులు అయ్యారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నోముల శంకర్, తెలంగాణ ఉద్యమకారులు ఎండి.ఇమామ్‌సాబ్, ఎండి. యాకుబ్, ఆముదం శ్రీను, మేడి కృష్ణ పాల్గొన్నారు.

# 6న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నియోజకవర్గస్థాయి సమావేశం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 6న మిర్యాలగూడలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఖాజా హమీదొద్దిన్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని మిర్యాలగూడ పట్టణం, మిర్యాలగూడ మండలం, వేములపల్లి, మాడ్గులపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు విషయంలో చర్చించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టుల కుటుంబాలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజు రాయితీ, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు రాయితీలపై చర్చించి అమలు



కోసం నిర్ణయం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఆయా మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, లోకల్ ఛానల్ మీడియా మిత్రులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు వెంకన్న, మహేష్, ఎండి.అయూబ్, మంద సైదులు, జయరాజు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూర్ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా శ్రీనివాస్

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు టౌన్ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చైర్మన్ వంగపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లుగా బొట్ల పరుశరాములు, కట్కూరి విజయ, బుగ్గ శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులకు అందుబాటులో ఉంటానని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.





## బస్సు కిందపడి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఆర్టీసి బస్సు డ్రైవర్ అజాగ్రత్త వలన బస్సు ఎక్కుతూ కింద పడ్డ ముదిరెడ్డి ప్రమీల (72) అనే వృద్ధురాలిపై బస్సు టైర్లు కాళ్ల మీదుగా పోవడంతో ఆమె ఎడమ కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం చెలకుర్తి గ్రామానికి చెందిన ముదిరెడ్డి ప్రమీల సోమవారం మధ్యాహ్నం కొండమల్లేపల్లి ఆర్టీసి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా బస్సు డ్రైవర్ బస్సును రీవర్స్ తీయగా వృద్ధురాలైన ప్రమీల కింద పడడంతో బస్సు టైర్లు ఆమె కాళ్లపై వెళ్ళడంతో తీవ్ర రక్త స్రావం జరిగింది. తీవ్ర గాయాలైన వృద్ధురాలి పరిస్థితిని చూసి చలించిపోయిన కొంత మంతి ఆమెను అంబులెన్స్‌లో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీర రమేష్ తెలిపారు. ఫ్రీ బస్సుల కారణంగానే బస్సు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని బస్టాండ్‌లో ఉన్న కొంత మంది ప్రయాణికులు వాపోయారు

## మహా న్యూస్ ఛానల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి చేసిన బీఆర్‌ఎస్ గుండాలను కఠినంగా శిక్షించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌లో విస్తుపోయే విషయాలను బయటపెట్టిన మహా న్యూస్, ఫోన్ ట్యాపింగ్ కథనాలను జీర్ణించుకోలేకనే మహాన్యూస్‌పై బీఆర్‌ఎస్ దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంపై దాడులు ఆందోళనకరమని, బీసీ సంఘాల పక్షాన ఈ దాడిని ఖండిస్తున్నామని అన్నారు. కలానికి సంకెళ్లు వేయాలనే బీఆర్‌ఎస్ కుట్ర బహిర్గతం అయిందని, ఈ దాడి బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల ఆగడాలకు నిదర్శనమన్నారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి మిర్యాలగూడ నియోజకవర్గ నాయకులు చేగొండి మురళీయాదవ్, ఊదర వెంకన్న, మహేష్‌గౌడ్, వీరేశంముదిరాజ్‌లు ఉన్నారు.

## రుణమాఫీ కోసం నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన చేనేత కార్మికులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే మాఫీ చేయాలని కోరుతూ పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కొంక లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో సోమవారం నుండి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి మద్దతుగా జిల్లా వ్యాప్తంగా అనే చేనేత కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ యువ నాయకులు మద్దతు తెలిపే మాట్లాడుతూ చేనేత కార్మికులకు (రెండు) లక్షల రూపాయలు వెంటనే రుణమాఫీ చేయాలని పోచంపల్లి చేనేత కార్మికుడు కొంక లక్ష్మీ నారాయణ రిలే నిరాహార దీక్ష చేయడం న్యాయమైన డిమాండ్ అని అన్నారు. కాగా పుట్టపాక చేనేత కార్మిక సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు.





## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని ఎలగల గూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అంజయ్య జయమ్మ దంపతుల కుమారుడు అశోక్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి అ కుటుంబాన్ని ఆదుకునేందుకు పంపిన పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని సోమవారం అశోక్ కుటుంబ సభ్యులకు ఆ గ్రామ బిఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ అకాల మరణం పట్ల ఆ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేకల శ్రీనివాస్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు సురిగి రవి, సురిగి లింగస్వామి, దాం మహేష్ యాదవ్, శంకరయ్య పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవి ఎస్‌సిలకు కేటాయించాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీ వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొండేటి మల్లయ్యకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ 20 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతోపాటు గతంలో జడ్పీటీసీకి ఏకగ్రీవంగా ఎనినకయ్యారని అన్నారు. గత ఎన్నికల్లో నకిరేకల్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ ఇవ్వలేదని, రానున్న రోజుల్లో అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తామని హామి ఇచ్చారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కూడా పనిచేశారని అన్నారు. కొండేటి మల్లయ్యకు డీసీసీ అధ్యక్ష పదవి అప్పగిస్తే జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

## ఘనంగా జినుకల ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మాజీ మత్స్యశాఖ డైరెక్టర్, సీనియర్ న్యాయవాదులు జినుకల ప్రభాకర్ జన్మదినాన్ని సోమవారం ఆయన నివాసంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కేక్ కట్ చేసి ప్రభాకర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకటరాజారెడ్డి, బత్తుల కృష్ణగౌడ్, పూస బాలకృష్ణ, గోదాసు పృధ్వీరాజ్, జెల్లా వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రేహాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జమీరొద్దిన్, మహిళా మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు గాదె శోభారాణి, రామిని రమేష్, ఎండి.అక్రమ్, కోనూరు కృష్ణ గౌడ్, సాల్వేరు లింగం, కొమ్ము శేఖర్, గోదాసు శివ, నారాయణ, బొడ్డు సురేందర్‌రావు, గురుకు శివ, లవణం సాయి, మినుముల సందీప్ పాల్గొన్నారు.



## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ ఒక భాగం



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ సోమవారం పదవి విరమణ పొందిన కరంటోతు చందన్‌నాయక్ లక్ష్మి పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగికి పదవి విరమణ ఒక భాగం అని అన్నారు. ఉన్నత పాఠశాలలో సుదీర్ఘంగా పనిచేసిన చందర్‌నాయక్ క్రమశిక్షణకు కట్టుబడి, సమయపాలన పాటించి, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారు చేశారని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపట్ల ఆసక్తి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పిఏసిఎస్ చైర్మన్లు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పిఆర్‌టియూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంటకు మద్దతు ధర ఘనత కాంగ్రెస్‌దే



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేం ద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి ధాన్యంకు క్వింటాకు రూ.500 రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. రైతు బరోసా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు అందించిన ఘనత కాంగ్రెస్ ్రభుత్వానిదేనిన చెప్పారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రైతులకు దిగుబడులు పెంచే దిశగా నాణ్యమైన విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను వ్యవసాయ అధికారుల సూచనలతో సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ కరీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## వెంకటేశ్వర రెడ్డి సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో బండా వెంకటేశ్వర రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ తిరుపతయ్య అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో గత కొన్ని సంవత్సరాలు సేవ చేసి డిప్యూటీ ఈ ఈ గా సోమవారం పదవి విరమణ పొందిన వెంకటేశ్వర రెడ్డి సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పంచాయతీరాజ్ శాఖలో ఎలాంటి మచ్చ లేకుండా ఎందరో మండల పొందిన వెంకటేశ్వర రెడ్డి సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం వెంకటేశ్వర రెడ్డి విజిత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఇ రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాసరెడ్డి,రిటైర్డ్ ఎస్ ఇ దయాకర్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ఇ ఇ తేరా భాస్కర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దీపక్ వినోద్ రఘుపతి గిరిధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దంపతులుబుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ గు మ్మల మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, జిల్లా పరిషత్ మినిస్ట్రీస్ ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిజాముద్దీన్ మృతి తీరనిలోటు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మాజీ జడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు నిజాముద్దీన్ మృతి తీరనిలోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆకస్మికంగా మృతి చెందిన నిజాముద్దీన్ మృతదేహంపై పూలమాలలువేసి సిపిఐ తరుపున నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి సుపరిచితమైన నాయకుడు నిజాముద్దీన్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే వారన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమస్యల పరిష్కారంలో, అభివృద్ధిలో లింగగిరిని ముందుంచారని అన్నారు. సిపిఐ పార్టీ తరుపున నిజాముద్దీన్ కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, యల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, దొంతగాని సత్యనారాయణ, సోమగాని కృష్ణ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

**ప్రజాపక్షం/నందికొండ:** ఈనెల 29న నల్లగొండ జిల్లా మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన అండర్ 14 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ విభాగంలో సెయింట్ జోసఫ్ పాఠశాల కు చెందిన విద్యార్థులు పి వెంకటసాయి, ఎస్ కె నజీబ్, ఆర్ నిఖిలేష్ లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు నల్లగొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాఠశాల పిఈటి కిరణ్ కుమార్ తెలిపారు. జూలై 6,7న హనుమకొండ, జేఎన్ వి స్టేడియంలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు తెలంగాణ తరపున రాష్ట్రస్థాయి జట్టుకు ప్రతినిధ్యం వహించనున్నట్లు ఆయన అన్నారు.రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లలిత, కరస్పాండెంట్ మతీన,సిస్టర్ క్లారా, అధ్యాపకులు అభినందించారు.

## ప్రజా పోరాటాలకు భాగస్వాములవ్వాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ చేసే ప్రజా పోరాటాలకు ప్రజలు భాగస్వాములు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి ఏండి జహంగీర్ అన్నారు. చౌటుప్పల మండల జనరల్ బాడీ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల సాధన కోసం ప్రజా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, గడ్డం వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొజ్జ బాలయ్య, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్ పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని ఆందోళన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని అవంతీపురం మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్లాంట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 11 నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతూ కుటుంబాలు వీదిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విరామంగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వం వేతనాలు అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలను చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాండావత్ హాతీరామ్, వెంకటేష్, సాయి తేజ, ప్రవీన్, భిక్షం, తారాసింగ్, రంగా, నాగేశ్వర్‌రావు, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఈడి వీధి లైట్లు మంజూరు



**ప్రజాపక్షం/చండూరు:** మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చండూరు మండలం ఇడికూడ గ్రామానికి 28 ఎల్ఈడి వీధి లైట్లు మంజూరు అయ్యినట్లు గ్రామ కాంగ్రేస్ పార్టీ నాయకులు తెలిపారు. ఇట్టి వీధి లైట్లను సోమవారం గ్రామంలో వివిధ వార్డులలో వీధి స్థంభాలకు వీధి లైట్లు లేని చోట ఏర్పటుచేస్తామని తెలిపారు. ఇడికూడ గ్రామానికి 28 వీధిలైట్లను మంజూరు చేసిన ఎంఎల్ఏ రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కడారి లక్ష్మ ణ్ , పంతంగి గిరి, మహ్మద్ ఘని, వీరమల్ల ప్రేమదాస్, బోయపల్లి రాములు పాల్గొన్నారు.



# అపూర్వ కలయిక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 32 సంవత్సరాలు తరువాత 1992/93వ పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తడకమల్ల ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు డిక్షనరీలు అందించారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌చార్జి గోదాల జానకిరాంరెడ్డి, జానకిరామయ్య, అజయ్, భాస్కర్ రెడ్డి, సైదులు, రవి, రామకృష్ణ, వెంకన్న, నాగరాజు, రమణ, నాగయ్య, కవిత, సుమలత, మంగమ్మ, హైమది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నూతనంగా బాధ్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌ను సోమవారం ఆర్పీల సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు, మురికివాడల సమాఖ్యలను బలోపేతం చేయాలని ఆయన కోరారు. మెప్మా కార్యక్రమాలను సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ బక్కయ్య, ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల చంద్రకళ, నాయకుల రజిత, సరిత, భవాని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను తీర్చిదిద్దడంలో రామయ్య కృషి ఎంతో ఉంది

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అంకిత భావంతో పనిచేసినప్పుడు గుర్తింపు వస్తుందని బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గా ఎంతో మంది హాస్టల్ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, ప్రయోజకులు గా తీర్చిదిద్దడంలో ఏబీసీ డిఓ పాల్వాయి గామయ్య కృషి ఎంతో ఉందని తెలంగాణ రిటైర్డ్ వార్డెన్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పాదురి ఇంద్ర సేనా రెడ్డి అన్నారు.బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గా 33 సంవత్సరాలుగా పని చేసి పదవి విరమణ పొందుతున్న గామయ్యను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం లో హెచ్ డబ్ల్యూ ఓఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రణధీవే, అద్దంకి సంజీవ అసిస్టెంట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రభుత్వ పథకాలు అర్హులకు అందడం లేదు

**మాజీ శాసనసభ్యులు నోముల భగత్**



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందడం లేదని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆరోపించారు. .సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని తమ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి అదనపు కలెక్టర్ కు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందడం లేదనే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే తమకు అందుబాటులోకి రావడం లేదని, కనీసం తమ ఫోన్ కూడా ఎత్తడం లేదని, మాజీ ప్రజా ప్రతినిధులమైన తమకే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలను బయట పెట్టడం లేదని, దీనిపై అధికారులను ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పడం లేదని అన్నారు. నిరుపేదలు ఎంతోమంది ఉన్నప్పటికీ వారికి ఇండ్లు రావడం లేదని, దీనిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో నేడు ప్రజావాణి కార్యక్రమానికి వస్తే జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకుండా పోయారని, దీంతో అదనపు కలెక్టర్ కు వినతి పత్రాలు సమర్పించి పరిస్థితిని వివరించామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక అధికారులు స్పందించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని కోరారు.ఆయన వెంట నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

# టై అండ్ డై అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరానికి స్పందన



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భారత లవ కుమార్, టిపిఎస్ మహిళా విభాగము సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ వారిచే మెగా హెల్త్ క్యాంపుకు విశేష ఆదరణ లభించింది. ఉదయం నుంచి పోచంపల్లి పట్టణ వ్యాప్తంగా వ్యాధిగ్రస్తులు ఈ హెల్త్ క్యాంపులో క్యూ కట్టారు. పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు శ్రేష్ఠ గుంటక రూప భారత లవకుమార్లచే హెల్త్ క్యాంపు ప్రారంభించారు. ఎముకలు, ఊపిరితిత్తులకు, జనరల్ ఫిజీషియన్ మహిళలకు గుండె వ్యాధులకు, ఇతర డెంటల్ సంబంధించిన నిష్ణాతులైన వైద్య బృందంచే టెస్టులు చేసి మందుల పంపిణీ చేశారు. సుమారు 500 మంది రోగులు వివిధ రకాల చికిత్సలకై బారులు తీరటం విశేషం. నిపుణులైన డాక్టర్ల బృందం పాల్గొన్న వ్యాధిగ్రస్తులందరికీ టెస్టులు చేసి మంచి ఆరోగ్య జీవన శైలి కోసం సలహాలు సూచనలు ఇచ్చారు. ఏబీపీఎస్ సెక్రటరీ ఇన్ జనరల్ జగన్నాథం తెలంగాణ ప్రాంత పద్మశాలి జనరల్ సెక్రెటరీ మాచర్ల రామచంద్రం వీవర్స్ వెల్ఫే ట్రస్ట్ చైర్మన్ బర్రింకల మధుసూదన్ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుర్రం శ్రవణ్ తడక రమేష్ గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు శారదా ప్రభాకర్ పోరండ్ల టిపిపి ఎస్ జనరల్ సెక్రెటరీ మదూరి శశికళ చిన్న కోట్ల స్వప్న రాజ్ ట్రెజరర్ నోముల రేఖ వైస్ ప్రెసిడెంట్ స్వరూప గారు ఆడెపు శాంతి అరుణశ్రీ కడవేరు అరుణ ఎలగందుల శోభ, పోచంపల్లి టైం అసోసియేషన్ కార్యదర్శి ముస్కూరు నరసింహ పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరికి గురౌవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, అదేవిధంగా జులైలో ఆపరేషన్ ముష్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము అని అడిషనల్ఎస్పిజి.రమేష్ అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచనలతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్ వన్ సమావేశంలో అడిషనల్ ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ డివిజన్ పరిధిలో మూడు టీమ్ లుగా ఏర్పాటు చేసి ఈ యొక్క ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కృష్ణయ్య, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ,అస్సిస్టెంట్ లేబర్ ఆపిసర్ కృష్ణవేణి, ఏ.హెచ్.టి.యు ఎస్.ఐ రంగా రెడ్డి,ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.






# కృష్ణారావు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యాభివృద్ధిలో కృష్ణారావు సేవలు అభినందనీయమని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ సోమవారం ఉద్యోగ విరమణచేసిన కృష్ణారావు ను అభినందించారు. కృష్ణారావు మూడు దశాబ్దలుగా విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని అన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావును పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్మాష్టర్లు వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లారీ ద్విచక్ర వాహనం ఢీ.. వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నందికొండ:** రోడ్డు ప్రమాదంలో లారీ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కరాటే ఇన్ స్ట్రక్టర్ మృతి చెందిన ఘటన సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్ఐ ముత్తయ్య తెలిపిన సమాచారం ప్రకారం హాలియా కు చెందిన రమేష్ స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో కరాటే ఇన్ స్ట్రక్టర్ గా విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఉంటాడని సోమవారం సాయంత్రం మూడు గంటలకు హాలియా నుంచి సాగర్ కు తన అసిస్టెంట్ ను తీసుకొని ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో స్థానిక శివం హోటల్ మూలమలుపు వద్ద వేగంగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రమేష్ కు తీవ్ర గాయాలై ఒక చెయ్యి పూర్తిగా తెగి పడిపోవడంతో కొన ఊపిరితో ఉన్న అతన్ని స్థానిక ఏరియా కమలా నెహ్రు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు, అతని అసిస్టెంట్ స్వల్ప గాయాలతో బయటపడటం జరిగిందని మృతి చెందిన రమేష్ హాలియాలోని తారకరామా కాంప్లెక్స్‌లో కరాటే ఇన్స్టిట్యూషన్ నిర్వహిస్తాడని ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

# క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్‌ను కలిసిన మరియగిరి డైరెక్టర్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నల్లగొండ మరియగిరి పుణ్యక్షేత్రుల డైరెక్టర్ రెవరెన్, ఫాదర్ . ధనరాజ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ని మర్యాద పూర్వకంగా కలిసి వారిని పూలమాలలతో సాల్వల తో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ క్రిస్టియన్, మైనారిటి సంఘం సభ్యులకు అందరికి ప్రభుత్వం నుండి అన్ని సహాయ సహకారాలు పూర్తిగా అందజేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ . కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శారయ్య, రెడ్డిమాస్ చార్లెస్, కామినేని జయరాజ్, బోర్ద ఆరోగ్యం తదితరులున్నారు.

# ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలం చాడ గ్రామంలో రైతు జక్క నర్సిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హార్టికల్చర్ ఆఫీసర్ కె.స్రవంతి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట యొక్క అవశ్యకత గురించి వాటి లాభాలు మరియు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి, తోటల యాజమాన్య పద్ధతులు ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, అంతర పంటలు, అంతరకృషి చర్యలు, గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. సూక్ష్మ సేద్య పరికరాలను రాయితీపై ఎస్సి,ఎస్టి రైతులకు 100 శాతం, బిసి రైతులకు 90 శాతం, ఓసి రైతులు 80 శాతం, ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ పంట సాగుతో రైతుకు ఎకరాకు 1.5 నుండి 2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ పంట సాగులో చీడపీడల సమస్య, కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల సమస్య ఉండదు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ కమలాకర్ మరియు రైతులు పాల్గొన్నారు.





## 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** జులై ఏడవ తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ భువనగిరి జిల్లా ఇన్చార్జి బుర్రు మహేందర్ మాదిగ అన్నారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో సంజీవయ్య కాలనీలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షులుగా గోస్కొండ మహేష్, బాబు ఉపాధ్యక్షులుగా ఒగ్గు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పొట్ట భాస్కర్, సహాయ కార్యదర్శిగా పొట్ట రాజు ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పొట్ట నవీన్ కుమార్, పొట్ట వెంకటేశ్వర్లు, ఒగ్గు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్య సంతోష్ నాయక్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని సంగ్యతండకు చెందిన భూక్య సంతోష్ నాయక్ గతంలో జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితిగా కొనసాగారు. జాతీయ, రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర, జాతీయ కమిటీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు. అవకాశాన్ని ప్రజాశ్రేయస్సు కొరకు, గిరిజనుల హక్కుల సాధనకై నిత్యం పాటుపడుతనని, గిరిజన ప్రజల యొక్క అభివృద్ధికి పాటుపడతానన్నారు.

## దేవి చరణ్ కుటుంబానికి రూ.50 లక్షల చెక్కు అందజేత

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండల కేంద్రంలో కట్టపల్లి గ్రామంలో ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గత రెండు నెలల క్రితం ప్రమాదశాత్తు బాంబు పేలుడు జరిగింది. బాంబు పేలుడులో మోటకొండూర్ గ్రామానికి చెందిన చాందోజు దేవి చరణ్ అక్కడే మరణించాడు. దేవి చరణ్ కుటుంబానికి ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున రూ.50 లక్షల చెక్కును సోమవారం కంపెనీ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆపరేషన్ దుర్గ ప్రసాద్, జనరల్ మేనేజర్ రాగివీర్, కాంట్రాక్టర్ పచ్చిమట్ల మధు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొట్ల యాదయ్య, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు భూమండ్ల యాదయ్య, బోట్ల ప్రశాంత్, కొంతం వెంకటరెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగ రీత్యా ఉద్యోగ విరమణ సహజం





**ప్రజాపక్షం/దేవరకొండ:** ఉద్యోగ రీత్యా ఉద్యోగ విరమణ సహజం అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని విష్ణు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన దేవరకొండ నీటి పారుదల శాఖ (డిఈఈ)గా విశిష్ట సేవలందించిన ఇరిగేషన్‌శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ ఎం. కరుణాసాగర్ సోమలక్ష్మి లకు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మండల కార్యదర్శి దేపా సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంతుర్కపల్లిలో ఆంగ్ల భాష ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న వల్ల ఉపేందర్ రావు ఆత్మీయ అభినందన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాపెల్లి శ్రీనివాస్ సభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బల్ల ఉపేందర్ రావు, పద్మ దంపతులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ కోట భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు దేసా శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి విద్యుత్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో భువనగిరి రూరల్ సెక్షన్ సీనియర్ లైన్స్ ఇన్స్పెక్టర్ దొంకెన బిక్షపతి, ఆర్టిజన్ కార్మికుడు చుక్క కిష్టయ్య పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి సబ్ డివిజన్ ఏడిఈ ఆనంద రెడ్డి, భువనగిరి రూరల్ ఏఈ వెంకటేష్, భువనగిరి టౌన్ ఏఈ సాయి కృష్ణ శాలువాతో సన్మానించారు. ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొబ్బిలి మురళి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ధరణికోట నరేష్, రేకల బాల నరసింహ, హెచ్ 82 యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

# నాలుగు కేజీల పప్పు తృణధాన్యాల మినీ కిట్స్ పంపిణీ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండల కేంద్రం రైతు వేదిక నందు మానోపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన శాంతకుమార్ అనే రైతుకు జాతీయ ఆహార భద్రత పథకం 2025 కింద వ్యవసాయ శాఖ మండల అధికారులు ఏవో సందీప్ కుమార్ ఏఈవో మణికుమార్ ఆదేశాల మేరకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా శాంతకుమార్ అనే రైతుకు నాలుగు కేజీల పప్పు ధాన్యలు, తృణధాన్యాల మినీ కిట్స్ పంపిణీ చెయ్యడం జరిగింది. పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సింగిల్ విండో చైర్మన్ గజేందర్ రెడ్డి వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, వివిధ మండలాల రైతులు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**రైతులు బాగుంటేనే దేశము అభివృద్ధి స్థానిక ఎమ్మెల్యే విజయుడు**



**ప్రజాపక్షం/ఉండవల్లి:** రైతులు ఎక్కడ బాగుంటే అక్కడ అభివృద్ధి జరుగుతుందని సాగునీరు పశుసంపద ఉన్నప్పుడే రైతుల అభివృద్ధి చెందారని స్థానిక ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గంలోని రైతు వేదికలో పప్పు ధాన్యాలు తృణధాన్యాలు మిని కిట్టు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే విజయుడు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గజేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు నాగార్జున రెడ్డి, అనిత, విస్తరణ అధికారులు, అల్లంపూరు మానవపాడు ఇటిక్యాల రాజోలి, వడ్డేపల్లి, నుంచి అధికారులు టిఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# నత్త నడక నడుస్తున్న బ్రిడ్జి పనులు

### మూడు సంవత్సరాలైనా పూర్తి కాని పనులు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండల పరిధిలోని బైరాపురం బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. కాంట్రాక్టర్ పనులు చేయడంలో నిర్లక్ష్యం ధరణి అవలంబిస్తున్నాడని విమర్శలు ఉన్నాయి. సుమారు కోటి రూపాయలు బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్న పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనదారులకు రాకపోకలకు స్థానికులకు ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్ట్‌తో పనులు చేయడం వలన జాప్యం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. పనులు కూడా నాణ్యతగా చేపట్టడం లేదానే విమర్శలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమైన పనులు ముందుకు సాగకుపోవడంతో వే మార్గం దారి లేక సమస్యగా ఏర్పడిందని స్థానికులు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికుడు పాండు మాట్లాడుతూ బ్రిడ్జి పనులు ప్రారంభమై మూడు సంవత్సరాల కాలం గడిచిన నేటికి పూర్తి కాకపోవడంతో భారీ వర్షాల ప్రభావం వల్ల స్థానికులకు రాకపోకలకు సమస్యల ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చెందారు. పన్నుల్లో నాణ్యత చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## సొంత ఇంటి కల నెరవేరింది

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలం శెట్టిపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుసిరెడ్డి వెంకటరెడ్డి లబ్ధిదారులతో కలిసి సోమవారం ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లతో పేదవాళ్ల సొంత ఇంటి కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పళ్ళ వీరయ్య పళ్ళ వెంకన్న పల్ల ఇందిరమ్మ నిర్మాణ కమిటీ అధ్యక్షులు ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేదింటి వరం



**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిరుపేదలకు పేదింటి వరమని చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ అన్నారు. మండలంలో జక్కల వారి గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు హౌసింగ్ ఏఈ అనిల్ ,మాజీ సర్పంచ్ జక్కల శ్రీను,,జక్కల మహేష్, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కల మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

## ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి వెంబడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి పట్టణానికి వచ్చే బైపాస్ ఫ్లైఓవర్ వద్ద గల కోళ్ల ఫారం పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవొచ్చని, చేతికి కంకణం, జంజము , మెడలో తాయత్తు, ఎడమ చేతికి గోరింటాకు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిసినవారు 6309680086 ,8712670186,8712670148 నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా వారు కోరారు. మృతిచెందిన ఘటనపై ఎల్లారెడ్డి గూడెం కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ డి. క్రాంతి కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** జాతీయ రహదారిపై జర్గిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన నార్కట్‌పల్లి పట్టణ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున NL01B4559 నెంబర్ గల ఎస్వీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్ తన బస్సును హైదరాబాద్ వైపు రాంగ్ రూట్‌లో వెళ్తు రెడ్డయ్య ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న TG07S5826 నెంబర్ గల మారుతి ఈకో వ్యాన్ కు టక్కరివ్వగా వ్యానులో ప్రయాణిస్తున్న కల్మకొలను అశోక్‌రెడ్డి , డ్రైవర్, మరో ప్రయాణికుడికి గాయాలు కావడంతో సమీపంలోని కామినేని ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అశోక్‌రెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కల్మకొలను రామ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి క్రాంతికుమార్ తెలిపారు.

## మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా ముత్తమ్మ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామ మథర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా సోమవారం రెండవ సారి చైర్మన్‌గా గోపాల్దాస్ ముత్తమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా విజయ, లక్ష్మీలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన ముత్తమ్మ మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, ప్రభుత్వం తరుపున రైతులకు సబ్సిడిపై దానా, మందులు అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.